కథ

**మనసు లేనిదే నువ్వు లేవు. నువ్వు లేనిదే జీవితమూ లేదు. ఇక బ్రతకడం ఎందుకు? గొంతులో ఊపిరి కదిలినంత సేపూ, బ్రతికినంత కాలం...నీ కోసమే ఎదురు చూస్తాను. ఆశపడతాను.**



నువ్వు నా దగ్గర ఉన్నప్పుడు ఎంత ఆనందంగా ఉంటుందో మాటల్లో చెప్పలేను. లోకాన్నే జయించినట్లుగా అనిపిస్తుంది. కానీ... నువ్వు దూరంగా ఉంటే మాత్రం... గుండె నిండా వెలితి. తెలీని బాధతో తల్లడిల్లి... నిన్ను చూడకపోతే ఇక చావు తప్ప మరోదారి లేదన్నంతగా వేదన కలుగుతుందంటే.... ఎవరు నమ్ముతారు.

ఒక్కోసారి మన భవిష్యత్ కళ్ల ముందు భయంకరంగా కనిపించి కళ్లలో కన్నీళ్లు సుడులు తిరుగుతాయి. ఈ కట్టుబాట్లు, అడ్డంకులూ, అంతరాలూ... అన్నీ మనిద్దరి మధ్య ఎందుకు ఏర్పడ్డాయా అని దుఃఖం ఆగదు.

ప్రేమించడం, ప్రేమించబడడం అనేవి ఈ ప్రపంచంలోని అద్భుతాలన్నింటిలోకి మరింత అద్భుతమైనవి. కానీ, ప్రేమతో పాటే...నీడలాగా

# పోస్టు చేయని ఉత్తరం...

ఆకునూరి హాసన్

ఈ కన్నీళ్లనీ, అంతులేని వేదననీ ఎందుకు ఏర్పరచాడు ఆ కనిపించని దేవుడు అనేది అర్థంకాదు. భగవంతుడు... ఏ మతంలో వాడైనా... కరుణామయుడు అంటారు. కానీ... ఈ విషయంలో మాత్రం ఎంత కర్కశుడో అనిపిస్తోంది.

నీతో గడిపిన కాసిన్ని క్షణాల మాధుర్యాన్ని గుండెలో నింపుకొని... ఆ జ్ఞాపకంతో పాటే... నీకు దూరంగా వెళ్లనా?... నా నీడతో పాటే... వెన్నంటి వచ్చే, నీ జ్ఞాపకం!! నా గుండెలో గూడుకట్టుకునే చీకటితో గుప్పెడంత వెలుగుని నింపుతుంది.

నీ నీలి కళ్లలో నన్ను నేను వెతుక్కుంటూ మైమరచిన క్షణాల మాధుర్యం మళ్లీ ఎప్పటికప్పుడు జీవితం మీద ఆశలు రేపి బ్రతకనిస్తోంది.

''జ్వరమొచ్చిందా?'' అంటూ నా నుదుటి మీద రాసిన నీ అరచెయ్యి చల్లదనం....

''ఏడుస్తున్నావా?'' అని అడుగుతూనే.... కన్నీళ్లు పెట్టుకునే నువ్వు!! నీ కోసం. నీతో జీవితం కోసం జీవితాన్నంతా వొదులుకోవడానికి సిద్ధపడే నేను... మనిద్దరి ప్రేమ! విధి మన మధ్య ఏర్పర్చిన అడ్డంకులూ... అన్నీ కలిపి, గొంతులో గుండెలాగా అడ్డుపడుతుంటే,,, ఇన్నేళ్ల జీవితంలో కనీసం చెమ్మగిల్లని నా కళ్లు.. కన్నీటి ప్రవాహాలుగా మారిపోతున్నాయంటే... ఎవరు నమ్ముతారు.

లోకంలో నువ్వు తప్ప మరో జీవితం లేకుండా బ్రతికాను....నిన్ను మాత్రమే ప్రేమించాను. కానీ, నీవు మాత్రం... నువ్వే కావాలని కోరుకునే వాళ్లు నీ ముందు క్యూ కడుతుంటే.. చివరికి నాతో నీకు ఎలాంటి అవసరం లేకుండా పోతుందేమో అనే భయం స్థిమితం లేకుండా చేస్తోంది.

కానీ, ఒక్కటి మాత్రం చెప్పగలను.

నా చివరి శ్వాస విడిచే వరకూ..నిన్ను ప్రేమిస్తూనే వుంటాను. నువ్వు.... నన్ను నమ్మినా, నమ్మకపోయినా... నేను మాత్రం...నువ్వు నా జీవితంలో ఒక భాగమవుతావనే... గాఢంగా విశ్వసిస్తాను.

ఐ బిలీవ్ ఫర్ యూ... ఐ డై ఫర్ యూ....!!

★